క్లుప్తంగా

ఎంపీడీఓ విష్ణుప్రసాద్ బాధ్యతల స్వీకరణ



గుడివాడరూరల్: గుడివాడ ఎంపీడీఓగా బీవై విష్ణుప్రసాద్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గుడివాడ ఎంపీడీఓగా పని చేస్తున్న అనగాని వెంకటరమణ చల్లపల్లి బదిలీ కాగా రెడ్డిగూడెం ఎంపీడీఓగా పని చేస్తున్న బీవై విష్ణుప్రసాద్ గుడివాడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన విష్ణుప్రసాద్‌కు మండల పరిషత్ అధికారులు, ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గుడివాడ మండలంలో పని చేసిన అనుభవం ఉందని, మండలాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పని చేస్తానని తెలిపారు.

3 నుంచి దసరా నవరాత్రి మహోత్సవాలు

గుడివాడటౌన్: స్థానిక జగన్నాథపురం పాటి మీద వేం చేసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు ఈ మహోత్సవాలు కొనసాగుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ప్రతి రోజు విశేష అలంకరణలో దర్శనమిస్తారన్నారు. ఈ సందర్భంగా 9 రోజులు భక్తుల గోత్రనామార్చన నిర్వహించేందుకు ఆలయ కార్యాలయంలో రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన చెప్పారు.

మూగ జీవాలకు పశుగ్రాసం అందించడం అభినందనీయం

గుడ్లవల్లేరు: వరదలతో అతలాకుతలమై పాడి రైతులు తమ మూగ జీవాలకు సరైన పశుగ్రాసం లేక ఇబ్బందులకు గురవుతున్నారని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. అలాంటి పరిస్థితుల్లో నందివాడ మండలంలోని వరద ప్రాంతాల్లోని మూగ జీవాలకు వెణుతురుమిల్లి గ్రామ రైతులు తమ ట్రాక్టర్లతో పశుగ్రాసాన్ని తరలించి తమ మానవత్వాన్ని చాటుకుంటున్న అభినందనీయులని కొనియాడారు. సోమవారం పశుగ్రాసాన్ని పంపించిన రైతులను ఆయన చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, స్థానిక టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



మొవ్వ: మొవ్వ – కూచిపూడి రహదారిపై లోడుతో ఉన్న టిప్పర్ పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. కూచిపూడి మీదుగా మొవ్వకు ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ఒక్కసారిగా పంట కాలువలోకి దూసుకుపోయింది. సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. టిప్పర్ బయటకు తీసే క్రమంలో కొంత మేర ట్రాఫిక్ అంతరాయం తలెత్తింది.

కోసూరులో దుండగుల దుశ్చర్య

కోసూరు(మొవ్వ): మొవ్వ మండలం కోసూరు గ్రామంలో ఆదివారం రాత్రి దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు పసుపు కండువా వేశారు. ఈ పని ఆకతాయిలు చేశారా.. లేదా టీడీపీ నాయకులు చేశారా అనేది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి చర్యకు పాల్పడటం హేయనీయమని గ్రామ పార్టీ శ్రేణులు, మండల శ్రేణులు భావిస్తున్నారు. ఈ ఉదంతం తెలుసుకున్న కూచిపూడి ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం తమ సిబ్బందితో కండువాను తొలగించి.. విగ్రహం వద్ద గస్తీ ఏర్పాటు చేశారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు డిగ్రీ విద్యార్థుల ఎంపిక



కైకలూరు: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారు. నూజివీడులో ఈ నెల 22న జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో కాలేజీ విద్యార్థులు సీహెచ్ పవన్‌కుమార్(ఫైనల్ బీఏ), కె.షారోన్ రోజా(సెకండియర్ బీఎస్సీ మ్యాథ్స్), పి.విన్ని(సెకండియర్ బీఎస్సీ మ్యాథ్స్), జి.కోటేశ్వరమ్మ(ఫస్టియర్ బీఏ) ఎంపికయ్యారు. త్వరలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొనను న్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, క్రీడల్లో తర్ఫీదు ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఎం.శివనాగరాజును కాలేజీ ప్రిన్సిపాల్ కె.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ ఏ.ఉదయ ప్రకాశరావు, అధ్యాపకులు అభినందించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతం



పోషకాహారాన్ని రుచి చూస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కుమార రాజా



ఆటపాకలో సీమంతాలు నిర్వహిస్తున్న కృష్ణకుమారి తదితరులు

పెదమద్దాలి(పామర్రు): గర్భిణులు పోషకా విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన పిల్లలు జన్మిస్తారని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. మండలంలోని పెదమద్దాలి గ్రామంలో ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం గర్భిణులకు నిర్వహించిన సీమంతాల కార్యక్రమంలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కుమార రాజా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వ వైద్యుల సలహాలు తీసుకుని మెరుగైన పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పోషకాహారాన్ని వారు రుచి చూశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ భానుశ్రీ, సూపర్ వైజర్లు మసిముక్కు శివనాగమణి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలి

కైకలూరు: క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకునే గర్భిణులు పూర్తి ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి చెప్పారు. ఆటపాక పంచాయతీ కార్యాలయంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు సీమంతాల కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చిన తర్వాత మహిళలకు 100 రోజులు ఎంతో కీలకమని చెప్పారు. గర్భిణులు, బాలింతలు తప్పకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు, నువ్వులు, చిరధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. పౌష్టికాహార స్టాల్ ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీటీసీ పట్టపు బాలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు విజిత, కల్పన, ఎస్కే ఆసియా, ఏఎన్‌ఎం దేవి, గ్రామ పెద్దలు రామిశెట్టి బుజ్జి, శొంఠి రాజేశ్వరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పలు ఆలయాలకు ఈఓల నియామకం



కొండలరావు, ఈఓ కొండలమ్మ ఆలయం



గోపాలరావు, ఈఓ భీమేశ్వర ఆలయం

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ ఈఓగా ఆకుల కొండలరావు నియమితులయ్యారు. జంగారెడ్డిగూడెం శ్రీ మద్ది ఆంజనేయ స్వామివారి ఆలయానికి కార్యనిర్వహణాధికారిగా పని చేస్తున్న కొండలరావుకు కొండలమ్మ ఈఓగా బాధ్యతలను సోమవారం అప్పగించారు. ఇక్కడ ఈఓగా పని చేసిన కానూరి సురేష్‌ను వేదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయానికి ఈఓగా బదిలీ చేశారు.

భీమేశ్వర స్వామి దేవస్థానం ఈఓగా గోపాలరావు

గుడివాడటౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులో వేం చేసి ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం, గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాధికారిగా కె.వేణుగోపాలరావు నియమితులయ్యారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ అమ్మవారి గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాధికారిగా పనిచేస్తున్న గోపాలరావు బదిలీపై గుడివాడకు వచ్చారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గోపాలరావు జగన్నాథపురంలో వేం చేసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, కాకర్లవీధిలోని వేణుగోపాల స్వామి వారి దేవస్థానం, దేవరకొండ నాగన్నసత్రం, గౌరీశంకరపురంలోని గౌరీశంకర స్వామి వారి దేవస్థానం, శ్రీ ఘంటసాల నాగభూషణం వైశ్య అన్నదాన సత్రాలకు ఆయన కార్యనిర్వాహణాధికారిగా వ్యవహరిస్తారు. గోపాలరావు గతంలో పట్టణంలోని పలు దేవాలయాలకు కార్యనిర్వాహణాధికారిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

రఘురామ కృష్ణంరాజు క్షమాపణ చెప్పాలి



గుడివాడలో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

గుడివాడ టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీలను తొలగించిన ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రఘురామ కృష్ణంరాజుపై చర్యలు తీసుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. దళితులకు రఘురామ కృష్ణంరాజు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం రఘురామ కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పొంగులేటి జయరాజు, మెండా కిరణ్, దారం ఉపేంద్ర, రేమల్లి నీలాకాంత్, తంటేపూడి బాబి, సీహెచ్ జోషి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవాలో భాగస్వాములు కావాలి

పామర్రు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పిలుపునిచ్చారు. మండలంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం అందరి బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారుల రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ చంటిబాబు

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. బొమ్ములూరు సమీపంలోని టిడ్కో సముదాయం వద్ద వాహన తనిఖీలను సోమవారం సాయంత్రం చేపట్టారు. వాహనాల రికార్డులు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ చంటిబాబు మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు, రికార్డులు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి అపరాధ రుసుం విధించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు. అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు పోలీసుల నిబంధనలు పాటించి తమకు సహకరించాలని ఎస్‌ఐ చంటిబాబు కోరారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

గుడివాడరూరల్: మండలంలో ఈ నెల 24వ తేదీ మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి బి.అనంతలక్ష్మి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వలివర్తిపాడు గ్రామంలో మంగళవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, లింగవరంలో మధ్యాహ్నం 2 నుంచి 5.30 గంటల వరకు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆయా గ్రామాల్లోని రైతులు, కౌలు రైతులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతుల సమస్యలు, సందేహాలను నివృత్తి చేస్తామని ఏవో తెలిపారు.

నేడు కానుకొల్లు, లింగాలలో..

మండవల్లి: మండలంలోని కానుకొల్లు గ్రామంలో మంగళవారం ఉదయం, లింగాలలో మధ్యాహ్నం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు, ఫీల్డ్ విజిట్, రైతు సేవా కేంద్రంలో సమావేశం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా పేర్కొన్నారు. బుధవారం ఉదయం పెరికెగూడెంలో, మధ్యాహ్నం అయ్యవారిరుద్రవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

వ్యాపారి ఇంట్లో చోరీ

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నంలోని రైలుపేటకు చెందిన ఓ వ్యాపారి ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. షాహిద్ టెంట్‌హౌస్ నిర్వహిస్తున్న వ్యాపారి ఇంట్లో చోరీ జరిగిందని మచిలీపట్నం పోలీసులకు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ముదినేపల్లిలోని బంధువుల ఇంట్లో కార్యక్రమం నిమిత్తం కుటుంబ సభ్యులు ఈ నెల 22వ తేదీన అక్కడకు వెళ్లారు. వ్యాపారి షాహిద్ బేగ్ ఇంటికి తాళాలు పెట్టి సమీపంలోని తన సోదరుడు ఇంట్లో నిద్రించడానికి వెళ్లాడు. మరుసటిరోజు ఉదయం వచ్చి చూసే సరికి తాళాలు పగులకొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా 60 గ్రాముల బంగారంతో పాటు రూ. 1.20 లక్షల నగదు చోరీకి గురైనట్లు గ్రహించి మచిలీపట్నం పోలీసులకు వివరాలు తెలియజేశాడు. చోరీ ప్రాంతంలో క్లూస్‌టీమ్ సిబ్బంది నిందితుల వేలిముద్రలను సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.ఏసుబాబు తెలిపారు.

ఆకాశ్ మృతి పట్ల సంతాపం



మండవల్లి: జార్ఖండ్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందిన తక్కెళ్లపాడుకు చెందిన జల్లి అబ్రహం మనవడు ఆకాశ్ మృతదేహాన్ని సోమవారం స్వగ్రామం తీసుకొచ్చారు. ఆకాశ్ భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఆయన తనయుడు దూలం వినయ్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబు రాజు, జల్లి శౌరి, వల్లూరి విక్కీ, చేబ్రోలు ప్రవీణ్, దావులూరి మోషే, చేబ్రోలు పూర్ణ ఉన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ముదినేపల్లిరూరల్: మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులను విద్యార్థులు సోమవారం సత్కరించారు. గురుపూజోత్సవం సందర్భంగా వీరిని సత్కరించాల్సి ఉన్నప్పటికీ భారీ వర్షాల వల్ల పాఠశాలలకు సెలవు రావడంతో ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సోమవారం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాసు తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు రంగబాబు, ప్రకాష్, నరసింహారావు, భాస్కరరావు, సుందరరావు, శారదాదేవి, శారదా, లక్ష్మి, సుభాషిణీ, సుజాత, వాసవి కనకదుర్గ, జ్యోతి, స్వర్ణను సత్కరించారు.

25, 26 తేదీల్లో స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

కైకలూరు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ ఈ నెల 25, 26 తేదీల్లో ఆటపాక నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని మండల కో–ఆర్డినేటర్ పీడీ బి.రవిచంద్ర సోమవారం చెప్పారు. బాలబాలికలకు విడివిడిగా ఎంపికలు ఉంటాయన్నారు. వాలీబాల్, ఖో–ఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలిపారు.

ఔషధాల వినియోగంలో జాగ్రత్తలు అవసరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గోపాల్‌నాయక్ తదితరులు

గుడ్లవల్లేరు: రోగులు సూచించే ఔషధాల వినియోగంలో ఫార్మాసిస్టులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గుడ్లవల్లేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.గోపాల్ నాయక్ తెలిపారు. గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్(ఐడీఏ) గుడ్లవల్లేరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఔషధాల దుష్ప్రభావాల వలన కలిగే మరణాలు ఈ మధ్య కాలంలో పెరిగాయన్నారు. రోగికి ఔషధం అందించే ముందే అది రోగికి సరిపడుతుందా లేదా చూసుకోవాలని సూచించారు. ఆ ఔషధం వలన కలిగే అనుకోని దుష్ప్రభావాలతో పాటు అరికట్టే జాగ్రత్తలను వివరించారు. ఫార్మసీపై వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలను ఆయన బహూకరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ఐడీఏ గుడ్లవల్లేరు శాఖ ప్రెసిడెంట్ డాక్టర్ పి.రవీష, వైస్ ప్రెసిడెంట్ కె.పరిమళ, సెక్రటరీ ఎ.సాయిధాత్రి, మెంబర్ ఎస్కే నాగూర్ మీరావలి, అధ్యాపకులు డాక్టర్ టి.బాలకృష్ణ, డాక్టర్ ఎస్కే అమీనాబీ, డాక్టర్ టి.ప్రశాంతి, బి.సత్యశ్రీ, డాక్టర్ వి.రజని, కె.పరిమళ పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం చెక్కుల అందజేత



ఎమ్మెల్యే రాముకు చెక్కులు అందచేస్తున్న మహిళా సంఘాల నేతలు

గుడివాడరూరల్: వరద కష్టకాలంలో బాధితులకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. పట్టణంలోని రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ నిమిత్తం పట్టణంలో మహిళా సంఘాలు సోమవారం ఆయనకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి విపత్తుతో వచ్చిన వరదల కారణంగా కష్టాల్లో ఉన్న బాధితులకు అండగా నిలిచి చేయూతనందించిన దాతలు, స్వచ్ఛంద సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. మాంటిస్సోరి మహిళా సంఘం రూ.లక్ష, అన్నే నరసింహారావు, పుష్పలీలావతి దంపతులు రూ.లక్ష, యలమంచిలి నాగేశ్వరరావు దంపతులు రూ.50 వేలు వెరసి రూ.3.50 లక్షల చెక్కులను సీఎం రిలీఫ్ ఫండ్ నిమిత్తం ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు వల్లూరుపల్లి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు జాస్తి రాజ్యలక్ష్మి, కార్యదర్శి వల్లూరుపల్లి శారద, కోశాధికారి ఝాన్సీలక్ష్మి, సంయుక్త కార్యదర్శి దండమూడి జయలక్ష్మి, కాజ సంధ్య పాల్గొన్నారు.

ఆపదలో దాతల ఆపన్న హస్తం..

గుడ్లవల్లేరు: ఆపదలో ఉన్న వరద బాధితుల కుటుంబాలకు దాతలు స్పందించి ఆపన్న హస్తం అందించటం ఆదర్శనీయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరులో వరద బాధితులకు సోమవారం పలువురు దాతలు ఆర్థికసాయం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దావులూరి సురేంద్రబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి పాల్గొన్నారు.

మా మంచి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

గుడ్లవల్లేరు: మా మంచి ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. గుడ్లవల్లేరు గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఇది మంచి ప్రభుత్వం పేరిట సోమవారం ఏర్పాటు చేసిన గ్రామసభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయనను టీడీపీ నాయకులు గజమాలతో సన్మానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ సర్పంచి చాపరాల బాలాజీ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొట్లూరి రవి, లయన్స్ మాజీ అధ్యక్షుడు పోలవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టర్ కుటుంబ సభ్యులను ఆదుకుంటా



ఎమ్మెల్యే రాముతో మాట్లాడుతున్న మీడియా సంఘాల నాయకులు

గుడివాడరూరల్: వ్యక్తిగత కారణాలతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గుడివాడ సాక్షి చానల్ రిపోర్టర్ పి.మహేష్ కుటుంబ సభ్యులను ఆదుకుంటానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ పాత్రికేయ సంఘాల నాయకులు మహేష్ మరణవార్త వివరాలను ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి ఆయనకు సోమవారం వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహేష్ కుమారుల చదువులు పూర్తయ్యే వరకు సహకారం అందిస్తానని చెప్పారు. అదే విధంగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మహేష్ భార్యకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించేలా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే హామీ పట్ల మీడియా సంఘాల ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మీడియా సంఘ నాయకులు వీర్ల శ్రీరామ్‌యాదవ్, మత్తి శ్రీకాంత్, వల్లభాపురపు బుజ్జిబాబు, పిల్లా శేఖర్, దారం ఉపేంద్ర, అడపా రంగనాథ్ పాల్గొన్నారు.

సఫాయిమిత్ర సురక్ష వైద్య శిబిరం ప్రారంభం

గుడివాడటౌన్: పరిసరాల పరిశుభ్రతకు అనునిత్యం పాటుపడే పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక వైద్యసేవలు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సోమవారం సఫాయిమిత్ర సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ శిబిరంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వైద్య సేవలందిస్తారన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండాలనేదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమన్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరాదేవి, వైద్యులు, వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఆటలతో శారీరక, మానసిక శక్తి పెంపు



మోపిదేవి: మానసిక, శారీరక శక్తికి పెంపొందించడానికి ఆటలు ఉపయోగపడతాయని మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు రావి దుర్గావాణి అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన విద్యార్థులు ఉల్లాసంగా ఉంటారని, చదువులో కూడా చురుకుదనం ఏర్పడుతుందని వివరించారు. అనంతరం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.వీరరవి, ఎంఈఓ ఎస్.దుర్గాసాగర్, ఎంఈఓ–2 పిచ్చయ్య పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్ సుభానీకి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ముదినేపల్లిరూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం సీనియర్ నాయకుడు నీలం మురళీకృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సుభానీకి ఆయన కార్యాలయంలో సోమవారం వినతిప్రతం అందజేశారు. ఈ ఏడాది కౌలు రైతుల గుర్తింపు కార్డులు రెన్యువల్ చేయకపోవడంతో బ్యాంకర్లు పంట రుణాలు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. దీనివల్ల అధిక వడ్డీలకు అప్పుల తెచ్చి సాగు చేయగా వర్షాలవల్ల తీవ్ర నష్టం వాటిల్లినట్లు చెప్పారు. మండలంలో దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న దేవాలయాల భూములు అధిక సంఖ్యలో సాగు చేస్తున్న కౌలురైతులు మరింత నష్టపోయినట్లు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న హనుమాన్ ప్రసాద్

ముదినేపల్లిరూరల్: అగ్నిబాధిత కుటుంబానికి నియోజకవర్గ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వర్రే హనుమాన్ ప్రసాద్ సోమవారం ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు అందజేశారు. మండలంలోని ఊటుకూరు శివారు నారాయణపురానికి చెందిన తోట చక్రవర్తి ఇల్లు శనివారం దగ్ధమై తీవ్ర నష్టం వాటిల్లింది. సమాచారం తెలుసుకున్న హనుమాన్ ప్రసాద్ చక్రవర్తిని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం, వస్తువులు, దుస్తులు అందజేశారు.

27న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పమిడిముక్కల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ చీలి విఠల్‌పాల్ తెలిపారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, సమావేశానికి సభ్యులందరూ తప్పక హాజరు కావాలని కోరారు.